క్లుప్తంగా

బధిర విద్యార్థులకు ఆటల పోటీలు

సాక్షి, భీమవరం: 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీ విజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి సంయుక్త అధ్వర్యాన భీమవరంలోని శ్రీ వెంకటేశ్వర బధిర పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆర్టీసీ డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ మాట్లాడుతూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందరికీ ఉండాలనే ఉద్దేశ్యంతో బధిరులకు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.తిరుపతిరావు మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా బధిరుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు రోప్ స్కిప్పింగ్, క్యారమ్స్, షటిల్, డిస్కత్రో, టెన్నికాయిట్, చదరంగం విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుమని, విజేతలకు ఈనెల 17న నిర్వహించే ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, అరసవల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కామర్స్ అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.బ్రహ్మం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అతిథి అధ్యాపక పోస్టుకు ఎంఏ కామర్స్‌లో 50 శాతం మార్కులు కలిగి ఉండి, అనుభవం కలిగి, పదవీ విరమణ చేసిన అధ్యాపకులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తులను ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కళలతో ప్రజల్లో చైతన్యం

భీమవరం అర్బన్: స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుతో ఎంతోమంది కళాకారులు రాత్రనక, పగలనగా పాటలు, నాటకాలు, హరికథ, బుర్రకథ, జానపద కళారూపాలతో సామాన్య ప్రజల్లో సైతం స్వాతంత్ర్యోమ స్ఫూర్తిని రగుల్చారని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారామ్ ప్రసాద్, కళా రంజని వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో శుక్రవారం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు కామేశ్వరరావు, సొసైటీ బ్యాంకు డైరెక్టర్ కొప్పర్తి సుబ్బారావు, ప్రధానోపాధ్యాయిని కె.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనలో అధికారులు పోటీ పడాలి

భీమవరం (ప్రకాశంచౌక్): లక్ష్యాలు సాధించుటలో మండల అధికారులు పోటీ పడి పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్ స్పందన సమావేశం మందిరంలో భూముల రీ సర్వే, అసైన్డ్ భూములు, సివిల్ సప్లై,, అడంగల్, సర్వే, ఇళ్ల స్థలాలు, భూసేకరణ, టూరిజం ప్రాజెక్టులు, స్పందన, మీసేవ, వాటరు టాక్స్ తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మండలాలు వారీగా అంశాల ప్రగతిని సమీక్షిస్తూ ప్రగతిలో వెనుకబడి ఉన్న మండలాల అధికారులపై జేసీ అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో ప్రగతిని చూపాలని ఆదేశించారు. మండల స్థాయిలో స్పందన కార్యక్రమం అత్యంత బాధ్యతతో ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని ఈనెల 21వ తేదీలోగా నూటికి నూరు శాతం పూర్తి చేయాలని జేసీ ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ దాసిరాజు, జిల్లా సివిల్ సప్లై అధికారి ఎస్.సరోజ, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

భీమవరంలో వసుధ ఫ్యాషన్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మహిళలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఆనంద్ ఇన్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణిలు, మహిళలు, విద్యార్థినిలకు ఉపయోగపడే ప్రఖ్యాతిగాంచిన సుమారు 50పైగా డిజైనర్స్ రూపొందించిన వస్త్రాలను ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, చెన్నై, మధ్యప్రదేశ్, హైదరాబాద్, వంటి నగరాల నుంచి తీసుకొచ్చినట్లు చెప్పారు. భీమవరం పట్టణ ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేస్తున్నామని ఈ ప్రదర్శన ఈనెల 12వ తేది వరకు ఉంటుందన్నారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేద్దాం

- కార్యకర్తలే పార్టీకి పునాది
- పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి


జక్కరంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

కాళ్ళ/పాలకోడేరు : కార్యకర్తలే వైఎస్సార్ సీపీకి పునాది అని, అందరూ కలసి పార్టీ బలోపేతానికి కృషి చేసిననాడే ఉండిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయగలమని నియోజకవర్గ పరిశీలకురాలు పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని జక్కరం గ్రామంలో మండల పార్టీ నాయకుల సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్త విబేధాలు పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పర్యటిస్తానని కార్యకర్తలను కలుస్తానని ఆమె తెలిపారు. టీడీపీ కంచుకోట అని చెప్పుకుంటున్న ఉండిని ఈసారి తప్పకుండా పగలగొట్టితీరడం ఖాయమని ఆమె అన్నారు. రాబోయే ఎన్నికల్లో పీవీఎల్ నర్సింహరాజు గెలుపు నల్లేరుపై నడకలా సాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను గూండాలుగా పోలుస్తూ వారిని తరిమి కొట్టాలంటూ అరాచకాలు సృష్టించడమే ప్రతిపక్షాల పని అని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ ఒక రాజకీయ అజ్ఞాని కాబట్టే రెండు చోట్ల పోటీచేసి ఒక్కచోట కూడా గెలవలేకపోయాడని ఎద్దేవా చేశారు. ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడై ఉండి కూడా ముఖ్యమంత్రిని ఏకవచనంతో పిలుస్తున్నాడని అసహనం వ్యక్తం చేశారు. పవన్ సినిమా యాక్టర్ కాబట్టే ఎవరైనా చూడటానికి వస్తారని, అయితే సినీ నటులు బాబూమోహన్ వచ్చినా అదేవిధంగా వస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాగ్యాస్త్రం విసిరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచంపూడి పద్మావతి, ఎంపీపీ పెన్మత్స విశ్వనాధరాజు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, జిల్లా సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మండల కన్వీనర్ గణేష్న రాంబాబు, గృహసారధులు. నాయకులు పాల్గొన్నారు. కుముదవల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు, పార్టీ మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు భూపతి రాజు వంశీ కృష్ణంరాజు, నాయకులు పాల్గొన్నారు.

సాయి మందిరానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న నరసింహారావు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం 14వ వార్డులో ఉన్న మినీ షిర్డీ సాయి మందిరం అభివృద్ధి నిమిత్తం భీమవరం ప్యాడి అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చవాకుల నర్సింహారావు, వరలక్ష్మి దంపతులు రూ.లక్ష నగదు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారికి ట్రస్ట్ తరపున బాబా శేష వస్త్రం, చిత్రపటం బహుకరించారు. కార్యక్రమంలో షిర్డీ సాయి సత్సంగ సేవాశ్రమం ట్రస్ట్ అధ్యక్షురాలు నిమ్మల శారద సాయి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు


ఉండి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీహరినారాయణ రాజు, సభ్యులు

ఉండి: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుందామని ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సేవలు, అభివృద్ధిపై కమిటీ సభ్యులు పరిశీలన చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో సంక్రమించే వ్యాధులు, తాగునీటి కాలుష్యం, దోమల నిర్మూలన వంటి అంశాలపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పన, సిబ్బంది, మందులు కొరత లేకుండా చర్యలు, అన్ని పీహెచ్‌సీల్లోనూ ల్యాబ్ సౌకర్యం వంటివి కల్పించి ప్రభుత్వాసుపత్రులను గొప్పగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో ఉండి సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, కలిసిపూడి సర్పంచ్ కేశబోయిన జానకి శ్రీనివాసరావు, కమతం బెనర్జీ, డాక్టర్ బి.సాయి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


రాయకుదురు సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి ఎస్ఈ శ్రీనివాసరావు


వీరవాసరం: సీసీ రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాసరావు ఆదేశించారు. వీరవాసరం మండలం రాయకుదురులో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ఆయన ఎం బుక్కులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు రోడ్ల సమస్య తలెత్తకుండా పెద్ద ఎత్తున సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులు సక్రమంగా వినియోగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం భారతి, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు, గెద్దం భాస్కరరావు, గుడాల వెంకటేశ్వరరావు, విప్పర్తి రాధాకృష్ణ, లొల్ల సీతారాం ప్రసాద్, పోలిశెట్టి శివన్నారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి చిన్న, బొక్క చిన్న, కవురు శివ, తానేటి ప్రసాద్, తానేటి బాలస్వామి, దూది అచ్చియ్య, ఎం భాస్కరరావు, పెద్దిరెడ్డి శ్రీరామమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శారద కళా సమితికి పూర్వ వైభవం తీసుకువస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న శారద కళా సమితి కార్యవర్గ ప్రతినిధులు

ఆకివీడు: గత నాలుగేళ్లుగా కళా ప్రదర్శనలకు దూరంగా ఉన్న శారద కళాసమితికి త్వరలోనే పూర్వవైభవాన్ని తీసుకువస్తామని కళాసమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం.వీ.సూర్యనారాయణరాజు తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన ఏర్పాటు చేసిన విశాఖ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో భరత నాట్య నృత్య ప్రదర్శన వివరాల్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్వీఎస్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా కళాసమితి ఈ ప్రాంతంలో సకల కళా ప్రదర్శనల్ని ప్రేక్షకులకు అందించిందని చెప్పారు. కోవిడ్ విజృంభణతో కళాసమితి కార్యదర్శి రచయిత, కవి, అధ్యాపకులు కొమ్ము సుబ్రహ్మణ్య వర ప్రసాద్ అవతార్ మృతితో కార్యక్రమాలు నిలుపుదల చేశామన్నారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా తనతో పాటు కార్యదర్శిగా కె.మూర్తిరాజు, కోశాధికారిగా డాక్టర్ ఏఎస్ఎన్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా గుర్రం శ్రీనివాస్ కార్యవర్గ ప్రతినిధులుగా కొనసాగుతూ కార్యక్రమాల్ని పునరుద్ధరించామన్నారు.

పోలీసు పరేడ్ సిబ్బందికి ఎంతో ఉపయోగం


పరేడ్‌కు హాజరైన పోలీస్ సిబ్బంది

సాక్షి, భీమవరం: పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, శరీర దృఢత్వానికి పోలీస్ పరేడ్ ఎంతగానో సహకరిస్తుందని, సిబ్బంది ఎంత దృఢంగా ఉంటే ప్రజలకు అంత మెరుగైన సేవలు అందించగలుగుతామని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మెడ్ రిజర్వ్(ఏఆర్) పోలీస్ సిబ్బంది, హోం గార్డ్‌ల పరేడ్‌ను పరిశీంచిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేపట్టే కవాతును ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో నిర్వహించాలని, పోలీస్ కవాతులో రాష్ట్ర పోలీసుల కంటే మన కవాతు మెరుగైనదిగా పేరు తెచ్చుకోవాలన్నారు. దీనికి అవసరమైన సూచనలు, సలహాలిచ్చారు. ముందుగా రవి ప్రకాష్ పోలీసు సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, ఏఆర్ ఆర్ఐ శ్రీకాంత్, భీమవరం వన్‌టౌన్, టుటౌన్ సీఐలు అడబాల శ్రీను, జి.శ్రీనివాస్, రూరల్ సీఐ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చర్మకార వృత్తిదారుల సమస్యలను పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: చర్మకారుల ఆధీనంలో ఉన్న భూములను స్టడీ సర్కిల్ పేరుతో స్వాధీనం చేసుకోవడం అన్యాయమని, వాటిని వారి అభివృద్ధికే కేటాయించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి అన్నారు. శుక్రవారం భీమవరంలో మాల్యాద్రి, సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబుతో కలిసి చర్మకార వృత్తిదారుల దుకాణాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాల్యాద్రి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 ఏళ్ళు పూర్తవుతున్నా దళిత చర్మకారులు నేటికీ వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భీమవరం పట్టణంలో వృత్తి చేసుకుంటున్న 60 మంది చర్మకారుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో చర్మకార వృత్తిదారుల సంఘం నాయకులు కె.బాలస్వామి, రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 7న ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలో రాజరామ్మోహన్ రాయ్ ద్వి శత జయంతి (ఆర్ఆర్‌డీఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 7న కళాశాల ప్రాంగణంలో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీకేజే ప్రసూన చెప్పారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గాంధేయవాది, విద్యాదాత చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ఆర్ఆర్‌డీఎస్ కళాశాలను ఏర్పాటు చేసి విద్యాదానం చేశారన్నారు. స్వర్ణోత్సవ వేడుకలకు రాజకీయ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరవుతారని ప్రసూన చెప్పారు. ముందుగా మూర్తిరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకాంతం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కత్తిపీటతో దాడి

ఆకివీడు: స్థానిక పెదపల్లి వీధిలో నివశిస్తున్న పడమట కనకరాజుపై కత్తిపీటతో అదే ప్రాంతానికి చెందిన అవనిగడ్డ నారాయణ, అతని భార్య దాడి చేసినట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సత్యనారాయణ శుక్రవారం చెప్పారు. పెదపల్లి వీధిలో కనకరాజు స్నేహితుడిపై నారాయణ, అతని భార్య దాడిచేయడంతో అడ్డు వెళ్లినందుకు తనపై ఈ నెల 8వ తేదీన కత్తిపీటతో దాడి చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

విరివిగా మొక్కలు నాటుదాం

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి


వాంద్రంలో మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఉండి: వసుధకు వందనం చేస్తూ విరివిగా మొక్కలు నాటే బాధ్యత చేపడదామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం ఉండి మండలం వాంద్రం పంచాయతీ కార్యాలయం వద్ద నా భూమి - నా దేశం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వసుధకు వందనం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు,జెడ్పీటీసీ రణస్థుల కనకదుర్గ, ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తదితర ప్రజాప్రతినిధులతో కలసి ఉసిరి,మామిడి మొక్కలు నాటి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు 'నామట్టి-నాభూమి' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా వసుధకు వందనం పేరిట పంచాయతీలు, పాఠశాలలు, కళాశాలు, పరిశ్రమలు తదితర ఆవరణల్లో గ్రామంలో కనీసం 75 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. నాటి స్వాతంత్రోద్యమ సమర యోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్లను త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ ప్రతీ ఒక్క లబ్ధిదారులకు రూ.20 వేలను అందించడంతో కలెక్టర్ ఆయనను అభినందించారు.ఈ సందర్భంగా గొల్లమందల కుమారికి రూ.20 వేల చెక్కును అందజేశారు. అనంతరం స్థానిక ఎస్సీ ఏరియాలోని ఎంపీపీ ఎస్పెషల్ స్కూల్ శిథిలావస్థకు చేరుకున్న తరుణంలో నాడు-నేడు నిధులతో నిర్మాణం చేపట్టాల్సి ఉన్నా మరిన్ని నిధులు కావాలని కోరడంతో కలెక్టర్ పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ టీవీ రాజేశ్వరరావు, డీపీఓ మల్లిఖార్జునరావు, గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ఎంపీటీసీ పీవీఆర్‌కే ఆంజనేయరాజు, ఉపసర్పంచ్ ముదుండి ప్రేమాస్వరూప, ఎంపీడీవో ఏవీ అప్పారావు, ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ ఎస్వీఎస్ నాయుడు ,కార్యదర్శి జేవీటీ నాయుడు, వీఆర్వో ఎస్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన ఆకివీడు అర్బన్ హెల్త్ సెంటర్


సమతానగర్ రోడ్డులో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలిస్తున్న నర్సింహరాజు

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)కు నూతన భవన నిర్మాణం పూర్తి కావడంతో త్వరలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్.నర్సింహరాజు చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అర్బన్ హెల్త్ సెంటర్ ప్రస్తుతం తాత్కాలిక సేవల్ని అద్దె భవనంలో అందిస్తుందని చెప్పారు. భవన నిర్మాణం పూర్తి కావడం, వైరింగ్ పనులు త్వరితగతిని పూర్తి చేసి త్వరలో ప్రారంభించడానికి సిద్ధం చేయాలని నగర పంచాయతీ అసిస్టెంట్ ఇంజనీర్ రాజుకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్లు పుంప్పాల పండు, వంగా జ్యోత్స, చీప్‌విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, జీ.ధనరాజు, శిరపు శ్రీనివాస్, హుస్సేన్, కౌన్సిలర్లు, కమిషనర్ కృష్ణ మోహన్, కాంట్రాక్టర్ ఉత్తరిల్లి నర్సింహారాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పార్టీ సేవాదళ్ రీజినల్ కో ఆర్డినేటర్ చినమిల్ల వెంకట్రాయుడు


మాట్లాడుతున్న వెంకట్రాయుడు

సాక్షి, భీమవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సేవాదళ్ పనిచేయాలని రీజినల్ కోఆర్డినేటర్ చినిమిల్ల వెంకట్రాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరం మండలం రాయలం గ్రామంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించిన సేవాదళ్ జిల్లాస్థాయి మండల, పట్టణ కన్వీనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతానికిపైగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు, రాష్ట్రాభివృద్ధికి జగన్ చేస్తున్న కృషిని సేవాదళ్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. ఆగస్టు చివరిలో సేవాదళ్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని, సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వెంకట్రాయుడు కోరారు. సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాలు, పట్టణాల సేవాదళ్ కన్వీనర్లు, వైవైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ఎస్ఆర్‌కేఆర్ విద్యార్థులకు ద్వితీయ స్థానం


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

సాక్షి, భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, వాటి నిర్మాణాలపై ఆసక్తిని కలిగించేందుకు దేశవ్యాప్తంగా ఫార్ములా ఆఫ్ రోడ్ మినీ బజా ఇండియా పేరిట మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు చెప్పారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులను ఆయన అభినందించారు. మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ పి.రామ్మూర్తి రాజు మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన 28 మంది విద్యార్థులు గ్రూపుగా ఏర్పడి జీప్ తరహాలో ఉండే ఏటీవీ వాహనాన్ని రూపొందించారని, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వీవీ మురళీకృష్ణంరాజు, యు.రాజేంద్రవర్మ ఆధ్వర్యంలో విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సాగి సత్యప్రతీక్ వర్మ, కె.బ్రహ్మరాజు, సుధీర్ వర్మ, పవన్ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలి


మాట్లాడుతున్న జడ్జి పవన్‌కుమార్

సాక్షి, భీమవరం: వచ్చేనెల 9వ తేదిన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన క్రిమినల్, ఎక్సైజ్, చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించుకోవాలని భీమవరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్ సూచించారు. శుక్రవారం కోర్టు ఛాంబర్‌లో ఆకివీడు, భీమవరం రూరల్ పోలీస్, కోర్టు రిప్రజెంటేటివ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్‌కుమార్ మాట్లాడారు. కోర్టు పరిధిలోని పోలీసు స్టేషన్లలో రాజీ పడదగిన కేసులను గుర్తించి బాధితులు, ముద్దాయిలకు సమన్యాయం జరిగేలా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో భీమవరం రూరల్, ఆకివీడు ఎస్సైలు బి.మోహన్‌రావు, ఎస్.సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.